సాక్షి తిరుపతి

శనివారం । 31 । ఆగస్టు । 2024



బాధితులకు సత్వర న్యాయం

త్వరితగతిన కేసులు పరిష్కరించాలని జిల్లా క్రైమ్ మీటింగ్‌లో ఎస్పీ సుబ్బరాయుడు అధికారులను ఆదేశించారు. - 8లో



శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. అధికారులు ఏర్పాట్లు చేశారు. - 8లో



పరకామణిలో లెక్కింపు పరిశీలన

తిరుమలలోని పరకామణిలో కానుకల లెక్కింపును టీటీడీ ఈఓ శ్యామలరావు శుక్రవారం పరిశీలించారు. - 8లో

న్యూస్‌రీల్

సాయుధ 'దర్బార్'



పోలీస్ పరేడ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైమ్ : తిరుపతి ఎమ్మార్‌పల్లెలోని పరేడ్ మైదానంలో శుక్రవారం జిల్లా సాయుధ పోలీసుల దర్బార్, సెరిమోనియా పరేడ్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఇంక్రిమెంట్ అంశంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు సంక్షేమం కోసం నిరంతరం కట్టుబడి ఉంటామని, ఎవరికి ఏ అవసరం వచ్చినా నేరుగా తమను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అదనపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జిల్లా ప్రత్యేక అధికారిగా సత్యనారాయణ

తిరుపతి అర్బన్ : జిల్లా ప్రత్యేక అధికారిగా దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ నియమితులయ్యారు. శుక్రవారం ఈ మేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యేక అధికారి జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించి నివేదికలు ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

నకిలీ సంస్థలపై చర్యలు తప్పవు

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లాలోని కొన్ని పాఠశాలల్లో నకిలీ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, వాటిపై చర్యలు తప్పవని డీఈఓ శేఖర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు మాత్రమే పాఠశాలల్లోకి అనుమతి ఉందని తెలిపారు. అయితే హిందూస్తాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆర్గనైజేషన్(హెచ్ఎస్‌జీఓ) తప్పుడు వాగ్దానాలతో మోసం చేస్తూ పాఠశాలల్లో కార్యకలాపాలు నిర్వహించే ప్రయత్నాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వెల్లడించారు. ఇకపై ఆ సంస్థ కార్యకలాపాలకు పాల్పడినట్లు తెలిస్తే చర్యలు తప్పవని, ఇలాంటి నకిలీ సంస్థలపై పాఠశాలల యాజమాన్యం, ఉపాధ్యాయులకు అవగాహన ఉండాలని స్పష్టం చేశారు.

యూపీఎస్సీకి పటిష్ట భద్రత



సూచనలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : యూపీఎస్సీ పరీక్షలకు పటిష్ట భద్రత, సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఆదివారం తిరుపతి నగరంలోని మూడు కేంద్రాల్లో యూపీఎస్సీ నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ 2024 పరీక్షలు నిర్వహించనున్నారు. శుక్రవారం ఈ మేరకు ఆయా కేంద్రాల వద్ద ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, అబ్జర్వర్ బ్రిజిలాల్ మీనా, అడిషనల్ కమిషనర్, కమిషనర్ ఆఫ్ జీఎస్టీతో కలసి కలెక్టర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పరీక్షలకు మొత్తం 821 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. సెంటర్‌లోకి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. శ్రీపద్మావతి బాలికల హైస్కూల్‌లో ఒక సెంటర్, శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో రెండు సెంటర్లలో పరీక్షలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ సతీష్, తహసీల్దార్ కేపీ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. ఏ టికెట్లూ లేకుండా దర్శనానికి వెళ్లే వారికి 18 గంటల సమయం పడుతోంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. క్యూ టీబీసీ వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 65,529 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 29,730 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారి హుండీకి కానుకల రూపంలో రూ.4.51 కోట్లు లభించింది. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 18 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టిక్కెట్లు కలిగిన భక్తులు 2 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించారని తెలియజేస్తోంది.





రాగాల పల్లకిలో.. కోయిలమ్మ

ఆమె దృక్పథం ఆశాజనకంగా మారింది. ఆలోచనా విధానంలో విశేషమైన మార్పు వచ్చింది. అవకాశాలను అందిపుచ్చుకుంటూ సమాజంపై తనదైన ముద్ర వేస్తోంది. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అన్నట్టు..అన్ని అంశాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తోంది. మనసుకు నచ్చిన పనిలో పదుగురు మెచ్చేలా రాణిస్తోంది. ఈ క్రమంలోనే కళారంగంలో సైతం అబ్బురపరిచేలా సత్తా చాటుతోంది.. అందులో భాగంగానే తిరుపతి బాలాజీ కాలనీలోని ఎస్వీ మ్యూజిక్ కాలేజీలో నారీమణుల ప్రభ దేదీప్యంగా వెలుగొందుతోంది. ఈ మేరకు కళాశాలలో ఇన్నేళ్లుగా పురుషులకే పరిమితమైన నాదస్వరం.. ఫ్లూట్ వాయిద్యాలపై ఆధిపత్యానికి అతివలు శ్రీకారం చుట్టారు. అలాగే ఓకల్.. హరికథ.. భరతనాట్యం.. వీణ.. గిటార్ తదితర కోర్సుల్లోనూ అద్భుతాలు ఆవిష్కరిస్తున్నారు. కుటుంబీకుల ప్రోత్సాహానికి తమ ఆసక్తిని రంగరించి వివిధ కేటగిరీల్లో సుమారు 120 మంది మహిళలు శిక్షణ పొందుతున్నారు. ఇందులో గృహిణులు.. ఉద్యోగినులు.. విద్యార్థినులనే తేడా లేకుండా సంగీతమే సోపానంగా ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు వడివడిగా అడుగులు వేస్తున్నారు.

– తిరుపతి సిటీ

- ఎస్వీ సంగీత కళాశాలలో పెరుగుతున్న విద్యార్థినులు
- నాదస్వరం.. ఫ్లూట్ కోర్సులపైనా ఆసక్తి చూపుతున్న అతివలు
- కుటుంబీకుల ప్రోత్సాహంతో అడ్మిషన్లు పొందుతున్న మహిళలు

తాతకు వినిపించాలనే తపన



మాది మధ్యతరగతి కుటుంబం. నాన్న ఆటోడ్రైవర్. అమ్మ గృహిణి. ఇద్దరం సంతానం. తమ్ముడు ఇంటర్ చదువుతూ గిటార్ నేర్చుకుంటున్నాడు. అకడమిక్ విద్యను కొంతవరకు కొనసాగించిన తర్వాత నాదస్వరంలో చేరాలనుకున్నా. పద్మావతి కళాశాలలో ఇంటర్ బైపీసీ చదివా. నా ఆసక్తిని గమనించి మా తాత నన్ను నాదస్వరం నేర్చుకో అమ్మా... అంటూ ప్రోత్సహించారు. దీంతో ఈ ఏడాది మ్యూజిక్ కళాశాలలో బీపీఏ (బ్యాచులర్ ఆఫ్ పెర్ఫార్మెన్స్ ఆర్ట్స్) నాదస్వరం స్పెషలైజేషన్‌గా ఆనర్స్ డిగ్రీలో చేరా. కోర్సులో చేరి నాదస్వరం పట్టుకుంటూనే నా కోరిక తీరిందనే ఫీలింగ్ కలిగింది. ఎంతో భక్తితో, ఆసక్తితో వాయిద్యాన్ని నేర్చుకుంటున్నా. నాలుగేళ్ల బీపీఏ కోర్సు పూర్తి చేసుకుని మా తాత ఎదుట పూర్తి స్థాయిలో నాదస్వరం వాయించాలనే తపన ఉంది. తర్వాత ఉద్యోగంపై దృష్టి పెడతా.

– అమృత శ్రీ, నాదస్వరం విద్యార్థిని

ఫ్లూట్ ఆర్టిస్ట్ కావాలన్నదే నా డ్రీమ్



నాకు చిన్ననాటి నుంచి ఫ్లూట్ అంటే అమితమైన ఇష్టం. మాది తిరుపతి. నాన్న టీటీడీలో ఉన్నత స్థాయి ఉద్యోగిగా పనిచేస్తున్నారు. కుటుంబసభ్యులు నా ఆసక్తిని గమనించి ప్రోత్సహించారు. దీంతో ఎస్వీ మ్యూజిక్ కళాశాలలో బీపీఏ ఆనర్స్ డిగ్రీ కోర్సులో చేరాను. నా డ్రీమ్ కోర్సులో చేరినందుకు చాలా సంతోషంగా ఉంది. భవిష్యత్‌లో ప్రొఫెషనల్ ఫ్లూటిస్ట్‌గా పేరు తెచ్చుకోవాలని ఉంది. పురుషులే ఎక్కువగా ఈ కోర్సులో చేరుతారనేది అపోహ మాత్రమే. ఎంతో మంది మహిళలు కళాశాలలో డే, ఈవెనింగ్ కోర్సుల్లో ఉన్నారు. కుటుంబసభ్యులు అండగా నిలబడితే ఏ రంగంలోనైనా మహిళలు పైచేయి సాధిస్తారు.

– కావ్య, ఫ్లూట్ విద్యార్థిని

బీటెక్ చదివా..కానీ ఫ్లూటే ప్రపంచం



బీటెక్ చదివా. నాన్న ఓ సంస్థలో అసిస్టెంట్ మేనేజర్‌గా రిటైర్డ్ అయ్యారు. ఇంట్లో వాళ్లు నేను ఐటీ ఫీల్డ్‌లో సెటిల్ అవుతానని భావించారు. నాకు మాత్రం ఫ్లూట్ ఆర్టిస్ట్ కావాలనే ఉండేది. ఈ విషయాన్నే ఇంట్లో చెప్పా. వారి సహకారంతో ఎస్వీ మ్యూజిక్ కళాశాలలో బీపీఏ ఆనర్స్ డిగ్రీ కోర్సులో ఫ్లూట్ విభాగంలో చేరా. ప్రస్తుతం రెండో ఏడాది చదువుతున్నా. ఇదే కళాశాలలో ఎంఏ పూర్తి చేయాలని ఉంది. కోర్సు పూర్తయిన వెంటనే ఇన్‌స్టిట్యూట్ పెట్టి ఫ్లూటిస్ట్‌లను తయారు చేయాలని ఉంది. అదే సంకల్పంతో నేను సైతం ఈ రంగంలో సత్తా చాటి పదిమంది మహిళలకు ఉపాధి కల్పిస్తాననే నమ్మకం ఉంది.

– శ్రీవర్ష, ఫ్లూట్ విద్యార్థిని

మార్పు స్పష్టంగా కనబడుతోంది



భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే కళారంగంలో నేడు మహిళలు అద్భుతంగా రాణిస్తున్నారు. నాదస్వరం, ఫ్లూట్ కోర్సుల్లో గతంలో పురుషులు మాత్రమే ఉండేవారు. కొన్నేళ్లుగా స్త్రీలలో మార్పు స్పష్టంగా కనబడుతోంది. పురుషులు మాత్రమే శిక్షణ పొందే డోలు, శాక్సోఫోన్, నాదస్వరం, మృదంగం, ఫ్లూట్ వంటి విభాగాలలో కళాశాలలోని పది విభాగాలకు సంబంధించి డే కోర్సులలో సుమారు 400 మంది, ఈవినెంగ్ కోర్సుల్లో 2వేల మంది విద్యార్థులు, గృహిణులు, ఉద్యోగులు శిక్షణ పొందుతున్నారు.

– ఎం.ఉమామధుబాల, ప్రిన్సిపల్, ఎస్వీ మ్యూజిక్ కళాశాల, తిరుపతి

నాదస్వరం అంటే ప్రాణం



మాది చిత్తూరు. నాకు నాదస్వరం అంటే ప్రాణం. నాన్న శాక్సోఫోన్ వాయిద్యాకారుడు. పలు ఫంక్షన్లు, ప్రోగ్రామ్‌ల్లో నాన్న వాయిస్తున్న స్వరాలను ఎంతో ఆసక్తిగా గమనించేదాన్ని. చిన్నప్పటి నుంచి నాదస్వరంలో కోర్సు పూర్తి చేసి నాన్నకు చేదోడుగా ఉండాలని భావించా. నాన్న అడుగుజాడలలో నడవాలనే తలంపుతో పాటు నాదస్వరంపై మక్కువతో ఎస్వీ మ్యూజిక్ కళాశాలలో విశారద, ప్రవీణ, డిప్లొమో కోర్సులు పూర్తి చేశా. ప్రస్తుతం టీటీడీ, అన్నమాచార్య ప్రాజెక్టు ఏర్పాటు చేసే పలు కార్యక్రమాలలో పాల్గొంటున్నా. అలాగే ప్రత్యేక కార్యక్రమాలతో పాటు, పెళ్లిళ్లకు హాజరై నాదస్వరం వాయిస్తున్నా. వివాహాలలో నాదస్వరం వాయించే సమయంలో పెళ్లికి వచ్చిన అతిథులు ప్రత్యేకంగా చూసి గౌరవమివ్వడం ఎంతో సంతృప్తి నిచ్చింది. పదిమంది మహిళలకు నాదస్వరం నేర్పించాలని ఉంది.

– కేఎస్ ఇందు, నాదస్వరం విద్యార్థిని



విద్యార్థులకు పాఠాలు నేర్పుతున్న ఫ్లూట్ అధ్యాపకుడు అనంతకృష్ణ



విద్యార్థినులకు నాదస్వరం పాఠాలు నేర్పుతున్న హెచ్‌ఎం ఈశ్వరమ్మ, అధ్యాపకులు లక్ష్మీసువర్ణ



ఎస్వీ సంగీత కళాశాల ప్రధాన ద్వారం

ఉద్యమం..'వన మహోత్సవం'

తిరుపతి మంగళం : హరితాంధ్రప్రదేశ్ లక్ష్యంగా వన మహోత్సవ ఉద్యమానికి శ్రీకారం చుట్టినట్టు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం తిరుపతి శ్రీవేంకటేశ్వర దివ్యారామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం –2024 నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తోపాటు జేసీ శుభం బన్సల్, తిరుపతి వైల్డ్ లైఫ్ డీఎఫ్ఓ సతీష్‌రెడ్డి, జూ క్యూరేటర్ సెల్వం, స్టేట్ సిల్వికల్చరిస్ట్ యశోదబాయ్ మొక్కలు నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని కోరారు. చెట్ల వల్ల పర్యావరణ సమతుల్యత ఏర్పడుతుందని చెప్పారు. వన భోజనాలు, వన మహోత్సవాలు నిర్వహిస్తే ప్రకృతికి మనిషికి ఒక మంచి అనుబంధం ఏర్పడుతుందని వివరించారు. జిల్లాలో 50 లక్షల మొక్కల నాటేందుకు అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టనున్నారని వెల్లడించారు. యశోదా బాయ్ మాట్లాడుతూ ఆరోగ్యానికి సహకరించే మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో డివిజనల్ అటవీ అధికారి తిరుపతి ధర్మరాజు, శివ కుమార్, డీఎంహెచ్ఓ శ్రీహరి పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు



మొక్క నాటుతున్న మంత్రి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆదిమూలం

పర్యావరణ పరిరక్షణకు కృషి

తిరుపతి అర్బన్ : పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం తిరుపతి చెన్నారెడ్డి కాలనీలోని ఆర్ అండ్‌బీ జిల్లా కార్యాలయ ప్రాంగణంలో కుటుంబసభ్యులతో కలసి వనమహోత్సవంలో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఆర్‌అండ్‌బీ ఈఈ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

అధ్వాన్న 'భోజనం'పై అసంతృప్తి

- ఎంజీఎం స్కూల్‌ను పరిశీలించిన అధికారులు
- నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..

తిరుపతి అర్బన్ : తిరుపతి బైరాగిపట్టెడలోని ఎంజీఎం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అధ్వానంగా భోజనం అందిస్తున్నారంటూ 'సాక్షి'లో మాకొద్దు ఈ సర్కార్ భోజనం శీర్షికతో శుక్రవారం ప్రచురితమైన ప్రత్యేక కథనంపై అధికారులు స్పందించారు. భోజనం సరఫరా చేస్తున్న ఇస్కాన్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మినారాయణ, సీనియర్ అసిస్టెంట్ వెంకట్, ఇస్కాన్ ప్రతినిధి మధుగోపాల్ వెంటనే పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టారు. మధ్యాహ్న భోజనం నాసిరకంగా ఉండడంతో పాఠశాలలోని 730 మంది విద్యార్థుల్లో 50శాతం మంది ఇంటి వద్ద నుంచే క్యారియర్ తెచ్చుకుంటున్నట్లు గుర్తించారు. దీనిపై ప్రధానోపాధ్యాయుడు మురుగన్‌ను ప్రశ్నించారు. రెండు రోజులు స్కూల్ భోజనం తింటే మరో రెండు రోజులు ఇంటి వద్ద నుంచి క్యారియర్ తెచ్చుకుంటున్నారని హెచ్‌ఎం వివరణ ఇచ్చారు. దీనిపై అధికారులు మండిపడ్డారు. పిల్లలకు నాణ్యమైన భోజనం వడ్డించాలని ఇస్కాన్ ప్రతినిధిని ఆదేశించారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

పిల్లలకు పులిహోర

'సాక్షి'లో కథనంతో ఇస్కాన్ సైతం మేల్కొంది. నాణ్యమైన పులిహోరను విద్యార్థులకు పంపిణీ చేసింది. ఆహారం రుచికరంగా ఉండడంతో పిల్లలు ఇష్టంగా భోజనం చేశారు. ఈ క్రమంలోనే అధికారులు సైతం మధ్యాహ్న భోజనం రుచి చూశారు. ఇదే విధంగా నాణ్యమైన ఆహారం అందించాలని స్పష్టం చేశారు.



తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.74,240
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.6,725
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.87,600
రిటైల్ వెండి గ్రాము	రూ.90.60

క్లుప్తంగా

పలువురు ఏఎస్పీల బదిలీ

● పలువురు డీఎస్పీలకు ఉద్యోగోన్నతి

చిత్తూరు అర్బన్: తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న పలువురు ఏఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ ద్వారక తిరుమలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో డీఎస్పీలుగా పనిచేస్తున్న పలువురు పోలీసు అధికారులకు ఏఎస్పీలుగా పదోన్నతులు లభించింది. తిరుపతి పోలీసు శిక్షణా కేంద్రంలో డీఎస్పీగా పనిచేస్తున్న ఐ.రామకృష్ణను పదోన్నతి కల్పిస్తూ తిరుమల ఏఎస్పీగా, రేణిగుంట డీఎస్పీ ఎం.వెంకటాద్రికి ఏఎస్పీగా పదోన్నతి కలిపిస్తూ పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని, సీఐడీలో డీఎస్పీగా పనిచేస్తున్న కె.రవిమనోహరాచారికి ఏఎస్పీగా పదోన్నతి కల్పిస్తూ తిరుపతి ఏఎస్పీగా నియమించారు. తిరుపతి ఏఎస్పీగా ఉన్న బి.నాగభూషణ రావును తిరుపతి సీసీఎస్ ఏఎస్పీగా బదిలీ చేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు





ఆలయం వెలుపల మంత్రి జనార్ధన్ రెడ్డి, ఉత్తర ప్రదేశ్ మంత్రి సూర్య ప్రతాప్

తిరుమల : తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వీరిలో రాష్ట్ర మంత్రి జనార్ధన్‌రెడ్డి, ఉత్తర ప్రదేశ్ మంత్రి సూర్య ప్రతాప్, తెలంగాణ ఎంపీ నగేష్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.



కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఆ పార్టీ నేతల ఇసుక అక్రమ రవాణాకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. కంటికి కనిపించిన వాగులు, వంకలు, నదులను యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా అక్రమంగా తరలించేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి తిరుపతి అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఒక రాత్రి ఒక్క పోలీస్ స్టేషన్ పరిధిలో ఇన్ని ట్రాక్టర్లు దొరికితే ఏ స్థాయిలో ఇసుక తోడేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

– సాక్షి ఫోటోగ్రాఫర్, తిరుపతి

బాధితులకు సత్వర న్యాయం

- బాధ్యతగా కేసులు పరిష్కరించాలి
- ఫిర్యాదీలతో మర్యాదగా నడుచుకోవాలి
- క్రైమ్ మీటింగ్‌లో ఎస్పీ సుబ్బరాయుడు



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైమ్ : పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందించాలని, కేసులను బాధ్యతగా పరిష్కరించాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. శుక్రవారం తిరుపతి శ్రీపద్మావతి మహిళా వర్సిటీలోని సావేరి సెమినార్ హాల్‌లో జిల్లా క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ కేసు దర్యాప్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మెలకువలపై సలహాలు అందించారు. న్యాయం కోసం ప్రజలు ఏ సమయంలో స్టేషన్‌కు వచ్చినా, ఫిర్యాదు స్వీకరించి సమగ్రంగా విచారణ జరపాలన్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉంటూ, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని కోరారు. స్టేషన్‌లో రిపోర్ట్ అయిన కేసుల గురించి ముందుగా అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రజలకు సహాయకారిగా కాకపోయినా అపకారం మాత్రం జరగకూడదని స్పష్టం చేశారు. ఎవరినీ అనవసరంగా స్టేషన్‌కు పిలిపించకూడదని తెలిపారు. ఒకవేళ వచ్చిన త్వరగా మాట్లాడి సమస్య లుంటే పరిష్కరించి పంపించాలని చెప్పారు.

ముందస్తు జాగ్రత్తలపై ప్రణాళిక

వినాయక చవితి ఉత్సవాలు, తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు, జాతర రానున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కోరారు. పోక్సో కేసుల్లో ముద్దాయిలపై వెంటనే షీట్స్ తెరిచి, ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారిపై హిస్టరీ షీట్ ఓపెన్ చేయాలని ఆదేశించారు. జిల్లాలో గంజాయి హాట్‌స్పాట్‌లను గుర్తించాలని చెప్పారు. ప్రతి సబ్ డివిజన్ పరిధిలో అనుభవం ఉన్న క్రైమ్ పార్టీ పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి హాట్ స్పాట్‌ల వద్ద గస్తీ పెట్టాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలన్నారు. మిస్సింగ్ కేసులు వచ్చిన వెంటనే త్వరితగతిన స్పందించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరిష్కరించేందుకు వీలైన కేసులను లోక్ అదాలత్‌కు పంపించాలని తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

ఎస్‌డీపీఓలు వారంలో ఒకరోజు తమ సబ్ డివిజన్ పరిధిలోని ఏదైనా ఒక కళాశాల, పాఠశాలను సందర్శించి సైబర్ క్రైమ్, మహిళా సంబంధిత నేరాలు, ట్రాఫిక్ నియమాలు, డ్రగ్స్ వంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి విద్యాసంస్థలో స్థానిక ఎస్‌హెచ్‌ఓ సెల్ నంబర్, డయల్ 100,112, సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్ 1930, క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్ హెల్ప్ లైన్ నంబర్ 1091ను నోటీసు బోర్డులో ఉంచాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, నాగభూషణరావు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బాధ్యతలేని పాలన

– శ్రీవారిని దర్శించుకున్న మాజీ మంత్రి మేరుగ నాగార్జున



తిరుమల: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాధ్యత లేని పాలన చేస్తున్నారని రాష్ట్ర మాజీ మంత్రి మేరుగ నాగార్జున విమర్శించారు. శుక్రవారం ఉదయం ఆయన వీఐపీ విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలసి తిరుమల శ్రీవారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలో రావడం ఖాయమన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను ఇక్కట్లకు, కష్టాలకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ పాలకులు విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారన్నారని ఆరోపించారు.

పరకామణిలో లెక్కింపు పరిశీలన



తనిఖీ నిర్వహిస్తున్న టీటీడీ ఈఓ శ్యామల రావు

తిరుమల : తిరుమల పరకామణి భవనంలో కానుకల లెక్కింపును టీటీడీ ఈఓ శ్యామలరావు శుక్రవారం పరిశీలించారు. హుండీల తరలింపు, నాణేలు, కరెన్సీల విభజన ప్రక్రియ డ్రెస్ కోడ్ అమలు, సీసీ టీవీ నిఘాను తనిఖీ చేశారు. హుండీల్లో బంగారం, ఇతర విలువైన వస్తువులు, విరాళాల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మాడ వీధుల తనిఖీ : శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధులను ఈఓ తనిఖీ చేశారు. బ్రహ్మోత్సవాల్లో విశేషమైన గరుడసేవకు ఏర్పాట్లను పరిశీలించారు. వివిధ గ్యాలరీల్లోని ప్రవేశ నిష్క్రమణ మార్గాలు, గరుడ సేవ గ్యాలరీలను రెండవసారి నింపడం, తదితర భద్రతా అంశాలను ఆరా తీశారు. చక్రస్నానం రోజున స్వామి పుష్కరిణి మార్గంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలందించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో ఈఓ మాట్లాడుతూ అక్టోబర్ 4 నుంచి 12వ తేదీ వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాయని తెలిపారు. అన్ని విభాగాల సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి, సీవీఎస్ఓ శ్రీధర్, ఎస్పీ సుబ్బరాయుడు, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ-2 సత్యనారాయణ, డిప్యూటీ ఈఓ హెల్త్ ఆశాజ్యోతి, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్ ప్రసాద్, వీజీఓలు సురేంద్ర, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

మారుతీనగర్ సుబ్రమణ్యం చిత్ర బృందం సందడి



ప్రేక్షకులనుద్దేశించి మాట్లాడుతున్న హీరో అంకిత్, హీరోయిన్ పసుపులేటి రమ్య

తిరుపతి కల్చరల్: రావు రమేష్ ప్రధాన పాత్రతో తిరుపతికి చెందిన యువకులు లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో ఉదయగిరి శ్రీహరి నిర్మాతగా రూపొందించిన మారుతీనగర్ సుబ్రమణ్యం చిత్రం బృందం శుక్రవారం తిరుపతిలో సందడి చేసింది. చిత్రం విడుదల సందర్భంగా ఈ చిత్ర బృందం శుక్రవారం తిరుమల శ్రీవారి దర్శించుకునంది. అనంతరం చిత్రం ప్రదర్శిస్తున్న కృష్ణతేజ థియేటర్‌కు చేరుకుంది. వీరికి థియేటర్ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి చిత్రాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా చిత్రం యూనిట్ థియేటర్ వేదికపై ప్రేక్షకుల మధ్య సందడి చేశారు. సినిమా టికెట్ వాట్సాప్‌కు పంపిన వారిలో ఒక్కరిని ఎంపిక చేసి వారికి నగదు ఫోన్‌పే చేసి ప్రేక్షకులను ఆనందభరితుల్ని చేశారు. అనంతరం నటీ నటులతో సెల్ఫీలు దిగేందుకు అభిమానులు సందడి చేస్తూ ఎగబడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు సుకుమార్ సతీమణి తబిత సుకుమార్, దర్శకుడు లక్ష్మణ్ కార్య, నిర్మాత ఉదయగిరి శ్రీహరి పాల్గొన్నారు.

లా అండ్ ఆర్డర్ ఏఎస్పీగా రవి మనోహరాచారి

తిరుపతి క్రైమ్ : తిరుపతి లా అండ్ ఆర్డర్ ఏఎస్పీగా రవి మనోహరాచారి నియమితులయ్యారు. శుక్రవారం ఈమేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ లాండ్ ఆర్డర్ ఏఎస్పీగా పనిచేస్తున్న నాగభూషణరావును తిరుపతి క్రైమ్ ఏఎస్పీగా బదిలీ చేశారు. సీఐడీ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న రవిమనోహరాచారి ఉద్యోగోన్నతిపై ఏఎస్పీగా బదిలీ అయ్యారు.

వంటవార్పుతో నిరసన



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

తిరుపతి(అలిపిరి): శ్రీవారి మెట్టు మార్గంలోని చిరు వ్యాపారులు టీటీడీ పరిపాలన భవనం ఎదుట శుక్రవారం వంట వార్పుతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర, లక్ష్మి మాట్లాడుతూ పది రోజులుగా పేదలు నిరసన తెలుపుతున్నా టీటీడీ యాజమాన్యం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. దాదాపు 31 కుటుంబాలను రోడ్డున పడకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు యుగంధర్, చిట్టిబాబు, మల్లికార్జున, లోకనాథం, చిరంజీవి, నరసింహ, మల్లి, సోను, మొగిలప్ప, రాంబాబు,. గణేష్ , ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


టిప్పర్ కిందపడి కార్మికుడి మృతి

భాకరాపేట : పీలేరు-కాలూరు జాతీయ రహదారి పనుల్లో గురువారం అర్ధరాత్రి విషాదం చోటు చేసుకుంది. మట్టి భాకరాపేట సమీపంలోని నెమిలిగుండ్లు వద్ద రహదారి పనులు చేసిన కార్మికులు కునుకు తీయడానికి మట్టి రోడ్డుపైనే పడుకున్నారు. రాత్రి సమయంలో మట్టి తీసుకొచ్చిన టిప్పర్ రివర్స్ తీసుకుంటూ పడుకుని ఉన్న కార్మికులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో హర్యానాకు చెందిన అతిపాల్(37) అక్కడికక్కడే మరణించాడు. తీవ్రంగా గాయపడిన మరో కార్మికుడు అనిల్ పీలేరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఆరుగురికి జైలు

తిరుపతి లీగల్ : అధిక మోతాదులో మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న ఆరుగురికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. అలాగే స్వల్ప మోతాదులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 17 మందికి జరిమానా విధించారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



మహేంద్ర (ఫైల్)

కోట: మండలంలోని గోవిందపల్లెపాళానికి చెందిన వావిళ్ల మహేంద్ర(24) అనే మత్స్యకారుడు కర్ణాటకలోని మంగుళూరులో చేపల వేటకు వెళ్లి మృతి చెందినట్లు గ్రామస్తులకు శుక్రవారం సమాచారం అందింది. మహేంద్ర 20 రోజుల క్రితం మంగుళూరులోని ఓ బోటు యజమాని వద్ద చేపలవేట కోసం పనికి కుదిరాడు.సహచరులతో కలసి బోటులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు సముద్రంలో పడి మరణించినట్లు తెలిసింది. ఈ ఘటనతో గోవిందపల్లెపాళెంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కేసుల పరిష్కారానికే లోక్ అదాలత్

●న్యాయవాదులతో న్యాయమూర్తుల సమావేశం



సమావేశంలో న్యాయమూర్తులు

తిరుపతి లీగల్ : మెగా లోక్ అదాలత్‌కు న్యాయవాదులు సహకరించాలని న్యాయమూర్తులు కోరారు. తిరుపతిలోని వివిధ కోర్టుల్లో విధులు నిర్వహించే న్యాయమూర్తులు స్థానిక న్యాయవాదులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి ఎం.గురునాథ్ మాట్లాడుతూ సెప్టెంబర్ 14న జరగనున్న మెగా లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యేందుకు న్యాయవాదులు సహకరించాలని కోరారు. లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసుల పరిష్కార సమయంలో నిందితుల తరపు న్యాయవాదులకు సమాచారం లేకుండా పోలీసులే కేసుల పరిష్కారంలో పాల్గొంటున్నారని న్యాయవా ది ఉమాపతి న్యాయమూర్తుల దృష్టికి తీసుకెళ్లారు. తిరుపతి కోర్టు ఆవరణలో నూతన భవనాల నిర్మాణానికి న్యాయమూర్తులు సహకరించాలని న్యాయవాదులు కోరారు. తిరుపతి ఐదవ అదనపు జిల్లా జడ్జి రామ్ గోపాల్ మాట్లాడుతూ కొన్ని కేసుల్లో సాక్షుల సాక్ష్యాన్ని రికార్డు చేయడానికి యువ న్యాయవాదులను కోర్టు కమిషనర్‌గా నియమిస్తామని అన్నారు. దానికి న్యాయవాదులు సహకరించాలని కోరారు. వివిధ అంశాలపై న్యాయమూర్తులు, న్యాయవాదులు చర్చించారు. ఈ సమావేశంలో తిరుపతి నాలుగవ అదనపు జిల్లా జడ్జి అర్చన, పదవ అదనపు జిల్లా జడ్జి రామచంద్రుడు, రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ కోర్టు జడ్జి నరసింహమూర్తి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ విజయసారథి రాజు, అదనపు సీనియర్ సివిల్ జడ్జి సునీత రాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వాణిశ్రీ, జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి, సరిత, సత్యకాంత్ కుమార్, పల్లపోలు కోటేశ్వరరావు, గ్రంధి శ్రీనివాస్, శ్రీకాంత్, తిరుపతి న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు గోపీచంద్, ఉపాధ్యక్షుడు భవాని శంకర్ ,ప్రధాన కార్యదర్శి మార్టిన్ పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

అద్భుతం.. ప్రకృతి వ్యవసాయం

● ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో ఉత్తరప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి



ప్రకృతి వ్యవసాయ క్షేత్రం సందర్శనలో ఉత్తరప్రదేశ్ మంత్రి సూర్యప్రతాప్‌సాహి

తిరుపతి రూరల్: చిన్న వ్యయసాయ క్షేత్రంలో ప్రకృతి వ్యవసాయం అద్భుతంగా చేస్తున్నారని ఉత్తరప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి సూర్యప్రతాప్ సాహి అన్నారు. తిరుపతి రూరల్ మండలం వేమూరు గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సూర్యప్రతాప్ సాహి శుక్రవారం సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో రైతు ఆచరిస్తున్న భూమిని తక్కువగా దున్నడం, పంట వ్యర్థాలతో భూమిని కప్పి ఉంచడం, ఏటీయం మోడల్, దేశీ వర్మి కంపోస్ట్ తయారీ, పట్టుపురుగుల పెంపకం, దేశీ ఆవులు, ప్రకృతి వ్యవసాయంలో చీడపీడల నివారణకు ఉపయోగించే కషాయాలు తయారుచేయడాన్ని మంత్రికి ఆదర్శ రైతు అయ్యప్పనాయుడు వివరించారు. ఈ సందర్భంగా అద్భుతంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని అయ్యప్ప నాయుడును మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం షణ్ముగం, వర్డ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ డాక్టర్ గంగాధరం, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఐదుగురు స్మగ్లర్ల అరెస్ట్

- 28 ఎర్రచందనం దుంగలు, మూడు వాహనాలు స్వాధీనం



పట్టుబడిన స్మగ్లర్లు, ఎర్రచందనం దుంగలు, వాహనాలతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తిరుపతి మంగళం : వడమాలపేట, పూతలపట్టు పరిసరాల్లో 28 ఎర్రచందనం దుంగలు, మూడు వాహనాలను స్వాధీనం చేసుకుని, ఐదుగురు ఎర్రచందనం స్మగ్లర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు శుక్రవారం అరెస్టుచేశారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు గురువారం టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన బృందాలు కూంబింగ్ చేపట్టాయి. ఆర్ఎస్ఐ వై.విశ్వనాథ్ బృందం పుత్తూరు సెక్షన్‌లోని వడమాలపేట అటవీ ప్రాంతంలో జరిగిన కూంబింగ్‌లో గురువారం 26 ఎర్రచందనం దుంగలు, ఒక ట్రక్, మరో కారు స్వాధీనం చేసుకుంది. స్మగ్లర్లను చుట్టి ముట్టే ప్రయత్నంలో నలుగురు పట్టుబడగా, మిగిలిన వారు తప్పించుకున్నారు. అరెస్టయిన వారిలో తమిళనాడు తిరువణ్ణామలై జిల్లాకు చెందిన ముగ్గురు, తిరువళ్లూరు జిల్లాకు చెందిన ఒకరు ఉన్నారు. ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్ కుమార్ బృందం చిత్తూరు-కడప హైవేలో కూంబింగ్ చేపట్టగా పూతలపట్టు సమీపంలోని రంగంపేట వద్ద రెండు ఎర్రచందనం దుంగలను కారులో తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు అడ్డుకున్నారు. వారిని చుట్టుముట్టగా ఒక వ్యక్తి పట్టుబడ్డాడు. మిగిలిన వారు పారిపోయారు. కారుతో పాటు రెండు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తి అన్నమయ్య జిల్లాకు చెందినవాడుగా గుర్తించారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నారు. రెండు కేసులను టాస్క్‌ఫోర్స్ పోలీసుస్టేషన్‌లో నమోదుచేసి ఎస్ఐ రఫీ దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం పట్టివేత



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనంతో అటవీశాఖ అధికారులు

భాకరాపేట : భాకరాపేట అటవీ ప్రాంతంలోని నాగపట్ల బీట్‌లో శుక్రవారం 16 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి దత్తాత్రేయ తెలిపారు. టేకు వనం వద్ద దుంగలు మోసుకొస్తున్న స్మగ్లర్లును గుర్తించి వారిని చుట్టు ముట్టామన్నారు. దుండగులు, దుంగలు పడేసి పారిపోయినట్లు వెల్లడించారు. పట్టుబడిన దుంగల విలువ సుమారు రూ.7 లక్షలు ఉంటుందని వివరించారు.

ఏటీఎం సెక్యూరిటీపై ఆగ్రహం



ఏటీఎంను పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

చంద్రగిరి : చంద్రగిరి కొత్తపేటలోని ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్‌లో చోరీ జరగడంతో శుక్రవారం రాత్రి ఘటనాస్థలాన్ని ఎస్పీ సుబ్బరాయుడు పరిశీలించారు. చోరీ జరిగిన తీరును క్రైమ్ డీఎస్పీ రమణ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏటీఎం సెంటర్‌లో సెక్యూరిటీ లోపాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సెంటర్ వద్ద సెక్యూరిటీ లేకపోవడం, సీసీ కెమెరా పనిచేయకపోవడం, చోరీ జరిగిన సమయంలో అలారం మోగపోవడం వంటి లోపాలను గుర్తించారు. ఏటీఎం నిర్వహణలో బ్యాంకు ఉద్యోగులు అలసత్వం వహించారని మండిపడ్డారు. వెంటనే ఏటీఎం సెంటర్ వద్ద సెక్యూరిటీను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం దుండగుడు వచ్చిన కారును సైతం సీసీ కెమెరాల్లో గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏటీఎం చోరీ ఘటనపై ఇప్పటికే దర్యాప్తు ముమ్మరం చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ఏటీఎం సెంటర్ల వద్ద సెక్యూరిటీ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.